# సత్తుపల్లికి తరలిన బీఆర్ఎస్ శ్రేణులు





పెనుబల్లి : నామినేషన్‌కు బయల్దేరిన బీఆర్ఎస్ శ్రేణులు, నీలాద్రిలో పూజలు నిర్వహిస్తున్న సండ్ర దంపతులు, వేంసూరు : లింగపాలెంలో బీఆర్ఎస్ నాయకుల ప్రచారం

పెనుబల్లి, నవంబర్ 9: సత్తుపల్లి బీఆర్ఎస్ అభ్యర్థి సండ్ర వెంకటవీరయ్య సత్తుపల్లిలోనామినేషన్‌కు మండలం నుంచి పెద్ద ఎత్తున బీఆర్ఎస్ శ్రేణులు గురువారం భారీగా తరలి వెళ్లారు. నాయకులు కోటగిరి సుధాకర్‌బాబు ఆధ్వర్యంలో ద్విచక్ర వాహనాలతో ర్యాలీగా బయల్దేరారు.

**ఆలయాల్లో పూజలు :** సత్తుపల్లి బీఆర్ఎస్ అభ్యర్థి సండ్ర వెంకటవీరయ్య అఖండ మెజార్టీతో గెలవాలంటూ వీ.ఎం. బంజర అభయాంజనేయస్వామి ఆలయంలో, రాజసాయి మందిరంలో మండల బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి భూక్యా ప్రసాద్ ఆధ్వర్యంలో గురువారం పూజలు నిర్వహించారు. తొలుత సత్తుపల్లిలో నామినేషన్ వేసేందుకు వెళ్తూ నీలాద్రీశ్వర దేవాలయంలో సండ్ర దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.



పెనుబల్లి : వీ.ఎం.బంజర అభయాంజనేయస్వామి ఆలయంలో బీఆర్ఎస్ నాయకుల పూజలు

తల్లాడ, నవంబర్9: ఆంజనాపురం అభయాంజనేయ స్వామిఆలయంలో ఎమ్మెల్యే సండ్ర, ఆయన సతీమణి మహాలక్ష్మి గురువారం పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే సండ్ర నామినేషన్ కార్యక్రమానికి మండలం నుంచి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు.

వేంసూరు, నవంబర్9: సత్తుపల్లిలో సండ్ర నామినేషన్ కార్యక్రమానికి మండలం నుంచి పెద్ద ఎత్తున బీఆర్ఎస్ శ్రేణులు గురువారం తరలివెళ్లారు. ఎంపీపీ పగుట్ల వెంకటేశ్వరరావు, మండల అధ్యక్షుడు పాల వెంకటరెడ్డి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ద్విచక్ర వాహనాలతో ర్యాలీగా వెళ్లారు.

వేంసూరు, నవంబర్ 9: సండ్ర వెంకటవీరయ్య గెలుపు కోరుతూ మండలంలో బీఆర్ఎస్ నాయకులు ప్రచారం నిర్వహించారు. గ్రామాల్లో ఇంటింటికి తిరుగుతూ బీఆర్ఎస్ మ్యానిఫెస్టోను ప్రజలకు వివరిస్తూ ప్రచారం చేపట్టారు. రామన్నపాలెంలో సత్తెమ్మతల్లి దేవాలయంలో రామన్నపాలెం ఎస్సీకాలనీ యూత్ సభ్యులు సండ్ర గెలుపు కోరుతూ ప్రత్యేక పూజలు నిర్వహించారు.





తల్లాడ :నామినేషన్‌కు తరలివెళ్తున్న బీఆర్ఎస్ నాయకులు, ఆంజనేయస్వామి ఆలయంలో సండ్ర దంపతుల పూజలు, వేంసూరు :సత్తెమ్మతల్లి దేవాలయంలో పూజలు

## మాజీ మంత్రి సంభానిని కలిసిన ఎంపీలు నామా, వద్దిరాజు



మాజీ మంత్రి సంభానితో నామా, వద్దిరాజు తదితరులు

కల్లూరు, నవంబర్ 9: సత్తుపల్లి నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ తరపున మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్ టికెట్ ఆశించి భంగపడి, బుధ, గురువారాల్లో ఆయన అనుచరులతో కలిసి విలేకర్ల సమావేశాలు నిర్వహించి తన ఆవేదనను వెల్లడించిన సంగతి తెలిసిందే. కల్లూరు మండల కేంద్రంలోని ఆయన స్వగృహంలో గురువారం సంభాని చంద్రశేఖర్‌ను ఎంపీ నామా నాగేశ్వరరావు, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర మర్యాద పూర్వకంగా కలిశారు. బీఆర్ఎస్‌లో చేరాలని సాదరంగా ఆహ్వానించారు. దీనిపై సానుకూలంగా స్పందించారు. త్వరలో తన నిర్ణయాన్ని వెల్లడిస్తానన్నారు. సత్తుపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి సండ్ర వెంకటవీరయ్య గెలుపు కోసం కృషి చేస్తానన్నారు. వారి వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పాలెపు రామారావు, జడ్పీటీసీ కట్టా అజయ్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దుర్గాప్రసాద్, ఎంపీటీసీ కొండూరి కిరణ్‌కుమార్ ఉన్నారు.

## ఏడోరోజు 10 నామినేషన్లు దాఖలు

సత్తుపల్లి, నవంబర్ 9 : నామినేషన్ల ప్రక్రియలో భాగంగా గురువారం 10 నామినేషన్లు దాఖలైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఆశోక చక్రవర్తి తెలిపారు. సండ్ర వెంకటవీరయ్య(బీఆర్ఎస్), మట్టా రాగమయి (కాంగ్రెస్), నంబూరి రామలింగేశ్వరరావు(బీజేపీ), నంబూరి శిరీష (బీజేపీ), నారపోగు ప్రసాదరావు (మన టీఆర్ఎస్), గద్దల సుబ్బారావు (ఇండియన్ ప్రజా కాంగ్రెస్), మేడి బసవయ్య (ధర్మ సమాజ్‌పార్టీ), శీలం వెంకటేశ్వరరావు (బహుజన సమాజ్ పార్టీ), మట్టా దయానంద్ విజయ్‌కుమార్ (కాంగ్రెస్), మిక్కిలి గాంధీ (భుజం ముక్తి పార్టీ) తరపున నామినేషన్లు దాఖలుచేశారు. ఇప్పటివరకు మొత్తం 21 నామినేషన్లు దాఖలైనట్లు ఆయన తెలిపారు.

## మాదిగలకు అన్యాయం చేస్తున్న కాంగ్రెస్‌ను ఓడించండి



మాట్లాడుతున్న అంబేద్కర్ యువజన సంఘం నాయకులు

సత్తుపల్లి, నవంబర్ 9 : రాష్ట్రంలో మాదిగ సామాజిక వర్గానికి అనేక దశాబ్దాలుగా తీవ్ర అన్యాయం చేస్తున్న కాంగ్రెస్ పార్టీని మాదిగలు ఓడించాలని అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బండారు వీరబాబు అన్నారు. సత్తుపల్లి బీఆర్ఎస్ అభ్యర్థి సండ్ర వెంకటవీరయ్యకు మద్దతుగా అంబేద్కర్ యువజన సంఘం, ఉస్మానియా యూనివర్సిటీ జేఏసీ, ఎంఆర్‌పీఎస్, టీఎంఆర్‌పీఎస్ సంఘాలు గురువారం సత్తుపల్లిలో సండ్రకు సంపూర్ణ మద్దతు ప్రకటించాయి. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుత ఎన్నికల సమయంలో ఖమ్మం జిల్లాలో రెండు ఎస్సీ రిజర్వ్‌డు స్థానాల్లోనూ కాంగ్రెస్ పార్టీ మాలలకు కేటాయించడాన్ని మాదిగలు అర్థం చేసుకోవాలన్నారు. సత్తుపల్లి నియోజకవర్గంలో సండ్ర వెంకటవీరయ్యను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. సమావేశంలో వివిధ సంఘాల నాయకులు గొల్లమందల శ్రీనివాసరావు, కనకపూడి సతీష్, పండు, మహేష్, పవన్, కల్యాణ్, నగేష్, సతీష్, గడ్డం పండు, అనిల్, ప్రకాష్, గడ్డం ప్రభాకర్, వేణు తదితరులు పాల్గొన్నారు.

## కిష్టారం ఓసీలో బొగ్గు నాణ్యతా వారోత్సవాలు

సత్తుపల్లి రూరల్, నవంబర్ 9: కిష్టారం ఓసీలో గురువారం బొగ్గు నాణ్యతా వారోత్సవాల సందర్భంగా మేనేజర్ రామకృష్ణ జెండాను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఏ సంస్థకైనా దాని మనుగడ, పురోభివృద్ధి ఆ సంస్థ ఉత్పత్తి, ఉత్పాదకత, నాణ్యతపై ఆధారపడి ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఇంజినీర్ వీరప్రసాద్, క్వాలిటీ ఇన్‌చార్జ్ సురేశ్, వివిధ సంఘాల బాధ్యులు మురళీకృష్ణ, కిశోర్, ప్రకాశం, భాస్కర్, సంక్షేమాధికారి సందీప్, ఉద్యోగులు పాల్గొన్నారు.

## సండ్ర సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిక



ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన ఉద్యమ నాయకుడు

తల్లాడ, నవంబర్9: ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి, ఉద్యమ నాయకుడు, డీబీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, మండలంలోని నూతనకల్ గ్రామానికి చెందిన మేడి పవన్‌దేవాన్షు ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య సమక్షంలో గురువారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆయనకు గులాబి కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. పవన్‌దేవాన్షు తెలంగాణ మలిదశ ఉద్యమంలో అనేక పోరాటాలు చేసి ఉద్యమంలో చురుగ్గా పనిచేశారు. కార్యక్రమంలో ఎంపీపీ దొడ్డా శ్రీనివాసరావు, ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**తల్లాడలో బీఆర్ఎస్ కార్యాలయం ప్రారంభం :** పార్టీ కార్యాలయాన్ని గురువారం తల్లాడలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు రెడ్డెం మోహన్‌రెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ నాయకులకు, కార్యకర్తలకు, ప్రజలకు అందుబాటులో ఉండేలా కార్యాలయాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు దూపాటి భద్రరాజు, దుగ్గిదేవర వెంకట్‌లాల్, యూసూఫ్, గరిడేపల్లి వెంకటేశ్వరరావు, దగ్గుల శ్రీనివాసరెడ్డి, బద్ధం కోటిరెడ్డి, దిరిశాల దాసురావు, గుండ్ల వెంకటేశ్వర్లు, దగ్గుల రాజశేఖర్‌రెడ్డి, కోడూరి వీరకృష్ణ, చల్లా నాగులు, తేళ్లూరి రఘు, శివ, రంగారావు తదితరులు పాల్గొన్నారు.



బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మండల అధ్యక్షుడు

## ప్రతిఒక్కరికి చట్టాలపై అవగాహన ఉండాలి

### సీనియర్ సివిల్ జడ్జి అరుణకుమారి




మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి అరుణకుమారి

సత్తుపల్లి, నవంబర్ 9 : లీగల్ సర్వీస్ డే సందర్భంగా కోర్టు ప్రాంగణంలో గురువారం చట్టాలపై అవగాహన సమావేశం నిర్వహించారు. సమావేశంలో సీనియర్ సివిల్‌జడ్జి అరుణకుమారి మాట్లాడుతూ ఏ విషయంలోనూ తొందరపాటు వద్దని, ఏదైనా సమస్య ఉంటే సామరస్యంగా కూర్చుని మాట్లాడు కోవాలన్నారు. ప్రత్యేకంగా 498పై అవగాహన కలిగి ఉండాలన్నారు. రాజీ తగ్గ కేసులు పరిష్కరించేందుకు మేము సిద్ధంగా ఉన్నామని అలాంటి కేసులుంటే లోక్ అదాలత్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్‌జడ్జి సరేన్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పాకలపాటి శ్రీనివాసరావు, కార్యదర్శి వెంకట్రావు, కోర్టు సూపరింటెండెంట్ బోయినపల్లి రవి, న్యాయవాదులు కిరణ్, రంజని, అరుణ్‌కుమార్, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## గడపగడపకూ న్యాయం న్యాయ సేవాసంస్థల ధ్యేయం

తల్లాడ, నవంబర్ 9: గడపగడపకు న్యాయ సహాయం అందించడమే న్యాయ సేవా సంస్థల ధ్యేయమని జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జీ మొహమ్మద్ అబ్దుల్‌జావేద్ పాషా అన్నారు. జాతీయ న్యాయ సేవా సంస్థల దినోత్సవం సందర్భంగా జిల్లా న్యాయ సేవాసంస్థ ఆధ్వర్యంలో గురువారం నూతనకల్‌లో నిర్వహించిన న్యాయ అవగాహన సదస్సులో మాట్లాడారు. సత్వర న్యాయం, న్యాయ సేవలు నిమిత్తం న్యాయ సేవాసంస్థలు పని చేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో న్యాయ సేవాసంస్థ ప్యానెల్ న్యాయవాది ఇమ్మడి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జీ మహ్మాద్ అబ్దుల్‌జావేద్‌పాషా